# Namaste Telanga

## Hackdan hack mania in Triple IT

**Date: 10/07/2015 | Edition: Hyderabad | Page: 12 | Source: Bureau | Clip size (cm): W: 14 H: 9**

**Clip: 1 of 1**


# ట్రిపుల్ ఐటీలో 'హ్యాకథాన్ హ్యాక్‌మానియా'



మాట్లాడుతున్న రమేష్‌రాస్కర్

**హాజరైన ఎంఐటీ ప్రొ.డాక్టర్ రమేష్‌రాస్కర్**

**24 గంటలపాటు నిరంతరాయంగా కార్యక్రమం**

**స్మార్ట్‌సిటీల రూపకల్పన తోడ్పాటుకే అంటున్న ప్రతినిధులు**



హాజరైన విద్యార్థులు, ఔత్సాహికులు

**హైటెక్‌సిటీ, జూలై 9:** గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ)లో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న హ్యాకథాన్ 2015 హ్యాకింగ్ మానియా గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) అసోసియేట్ ప్రొఫెసర్, ఎంఐటీ మీడియా ల్యాబ్స్ కెమెరా కల్చర్ రీసెర్చ్ గ్రూప్ హెడ్ డాక్టర్ రమేష్ రాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సిటీలు స్మార్ట్‌సిటీగా రూపాంతరం చెందకముందే వాటిలో నివసించే పౌరులు డిజిటల్ పౌరులుగా మారుతున్నారన్నారు. సాంకేతిక రంగంలో అద్భుత ఆవిష్కరణల దిశగా దేశం దూసుకెళ్లాలన్నారు. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని ముందుకెళ్లేందుకు యువ ఔత్సాహికులు దృష్టి సారించాలన్నారు. నేడు గూగుల్ వంటి సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పైనే దృష్టి సారించాయని, మెషీన్ లర్నింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి ఆ దిశగా తమ పెట్టుబడులను కొనసాగిస్తున్నాయన్నారు. స్మార్ట్‌సిటీల అభివృద్ధి కోసం హైసియా ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ హ్యాకథాన్ కార్యక్రమం ఐటీ విద్యార్థులకు, సాంకేతిక నిపుణులకు ఒక వేదికగా మారుతుందని తెలిపారు. వారు తమ నైపుణ్యాలను రంగరించి సాంకేతిక పరిజ్ఞానంలో నూతన ఆవిష్కరణలను తీసుకువచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు కరుణా గోపాల్, ప్రోగ్రెస్ సాఫ్ట్‌వేర్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్, హైసియా అధ్యక్షుడు రమేష్ లోగనాథన్, ట్రిపుల్ ఐటీ–హెచ్ ఫౌండేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ టామ్ థామస్, సీఈవో, పర్పుల్ టాక్ కో ఫౌండర్ రవి కోరుకొండ, అప్‌టెక్ ఐడియా ల్యాబ్స్ ఎండీ పంకజ్ దివాన్, డాక్టర్ వీరేంద్ర సంగ్వాన్ పాల్గొన్నారు.

**నూతన ఆలోచనలకు, ఆవిష్కరణలకు కేరాఫ్ 'హ్యాకథాన్'..**

మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ హ్యాకథాన్‌లో నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఐటీ కంపెనీలకు చెందిన ఉద్యోగులు దాదాపుగా 200 మంది వరకు పాల్గొననున్నారు. వీరు జట్లుగా విడిపోయి తమ ఆలోచనలను యాప్స్, సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ తదితర అంశాల రూపంలో హ్యాకథాన్‌లో ఆవిష్కరించనున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన ఈ హ్యాకథాన్ 24 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగి శుక్రవారం మధ్యాహ్నం వరకు ముగియనుంది. అనంతరం హ్యాకథాన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు తమ ఆవిష్కరణలను నమూనా ప్రదర్శన ఇవ్వనున్నారు. పోటాపోటీగా జరిగే ఈ హ్యాకథాన్‌లో ఉత్తమమైన ఆవిష్కరణలను జ్యూరీ సభ్యులు ఎంపిక చేసి విజేతలకు నగదు పురస్కారాలతోపాటు సీడ్ ఫండ్‌ను కల్పించనున్నారు. చివరి రోజు కార్యక్రమం లో వివిధ ఐటీ కంపెనీలకు చెందిన నిపుణులతో ప్రసంగ కార్యక్రమాలు ఉంటాయని హైసియా ప్రతినిధులు తెలిపారు.